అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 281 గురువారం 5 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మున్సిపల్ ఎన్నికల తరవాత
# రైతుభరోసా



### మిర్యాలగూడ ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి**

**సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి**

**రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం**

**తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్**

**తెలంగాణ తల్లి మన సోనియమ్మ**

మిర్యాలగూడ,**ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మిగతా 2లో...



# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం



**ఎస్సీఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు**

**ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సిఎం రేవంత్**

**మహబూబ్‌నగర్ ప్రచారంలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్**

మహబూబ్‌నగర్,**ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని మిగతా 2లో...

## జిమ్‌ల ముసుగులో యువతులకు వల

**అన్ని రాష్ట్రాలు, కేంద్రానికి**

**నోటీసులు జారీ చేసిన ఎన్ హెచ్‌ఆర్సీ**

**యూపీలోని మీర్జాపూర్‌లో 50 మందికి పైగా బాధితులని ఫిర్యాదు**

**జిమ్‌ల నిబంధనలపై నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్**



**న్యూఢిల్లీ ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా ఉన్న జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల ముసుగులో యువతులపై లైంగిక దోపిడీ, బలవంతపు మతమార్పిడులు జరుగుతున్నాయన్న తీవ్రమైన ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్‌ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదికలుమిగతా 2లో...

## అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు

**ఆవరణలో 8 మంది సస్పెన్షన్ ఎంపీల ఆందోళన-లోక్‌సభలో వాయిదాల పర్వం**

**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఇతర ఎంపీల మద్దతు**



**న్యూఢిల్లీ ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** ఎప్‌స్టీన్ ఫైల్స్, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని అంశాలు ఎక్కడ బయటపడతాయో అని కేంద్రం భయపడుతోందని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. బుధవారం ఉభయ సభల ఆరంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని మకర ద్వారం వద్ద సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఎంపీ ఎస్. వెంకటేషన్, కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాణిక్యం ఠాగూర్, ప్రశాంత్ పడోలే, హిబి ఈడెన్, డీన్ కురియకోస్, గుర్జీత్ సింగ్ ఔజ్లా, అమరీందర్ సింగ్ రాజా వారింగ్ పాల్గొన్నారు. ప్రధాని మోడీ, అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ('పీఎం ఈజ్ కాంప్రమైజ్డ్')తో రాజీపడ్డారనిమిగతా 2లో...

# ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినట్టు ఆధారాల్లేవు

### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

హైదరాబాద్**ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరినట్టు ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తేల్చారు. సంజయ్ కుమార్‌పై అనర్హత వేటు వేయాలంటూ మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేశారు. పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేకు క్లీన్‌చిట్ ఇచ్చారు. బుధవారం అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో అనర్హత పిటిషన్‌పై స్పీకర్ విచారణ జరిపారు. ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినట్టు తగిన ఆధారాలు లేవంటూ అనర్హత పిటిషన్‌ను కొట్టివేశారు. ఫిరాయింపుల కేసులో ఇప్పటి వరకు ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. మిగతా 2లో...





## న్యాయం ఏడుస్తోంది

**: సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ**

**ఈసీపై సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ పిటిషన్**

**తన పిటిషన్ పై తానే వాదనలు వినిపించిన మమత**

**ఈసీపై తీవ్ర విమర్శలు గుప్పించిన మమత**

**న్యూఢిల్లీ ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం (ఈసీఐ)పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) వోటర్ లిస్ట్‌పై సవాలు చేస్తూ ఆమె దాఖలుమిగతా 2లో...



## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పవన్ ప్రచారం

**పవన్ కల్యాణ్ ను కలిసిన కిషన్ రెడ్డి, రాంచందర్ రావు**

**బీజేపీకి పవన్ మద్దతు ప్రకటించారన్న రాంచందర్ రావు**

**బీజేపీ తరపున ప్రచారం చేయడానికి అంగీకరించారని వెల్లడి**

హైదరాబాద్**ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు.. పవన్ కల్యాణ్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మిగతా 2లో...

## స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

**కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా**

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కెటిఆర్ ఆగ్రహం**

హైదరాబాద్,**ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని మిగతా 2లో...



## కొత్త విద్యుత్ కనెక్షన్లలో మార్పులు

**రైతుల నుంచి ఓఆర్సీ ఫీజు రద్దు**

**గేటెడ్ కమ్యూనిటీల్లో వ్యక్తిగత మీటర్లకు అనుమతి**

**మ్యాన్‌వల్‌కు స్వస్తి..ఇక నుంచి అన్ని ఆన్‌లైన్లోనే**

**గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



**హైదరాబాద్ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో గురువారం నుంచి భారీ మార్పులు చోటుచేసు కోనున్నాయి. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) జారీ చేసిన కొత్త మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. వినియోగదారుల అభ్యర్థన మేరకు వారికి పారదర్శక సేవలను అందించేం దుకు అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత, విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 181లోని సబ్-సెక్షన్ (1) ప్రకారం సవరణలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ గెజిట్ గురువారం నుంచి అమల్లోకి రానుంది. కొత్త నిబంధనల ప్రకారం కనెక్షన్ల కోసం కరెంట్ ఆఫీసుల చుట్టూ తిరిగే బాధ వినియోగదారులకు తప్పనుంది. ఎస్టిమేషన్ల పేరిట కాంట్రాక్టర్లు, అధికారుల అక్రమ దందాకు తెరపడనుంది. మిగతా 2లో...

# న్యాయం ఏడుస్తోంది

**(మొదటి పేజీ తరువాయి)**
చేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్ ముందు వాదనలు జరిగాయి. "న్యాయం తలుపుల వెనక ఏడుస్తోంది" అంటూ మమత గట్టిగా అరిచారు. తాను మాట్లాడేందు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని కోరగా సీజేఐ అంగీకరించారు. 15 నిమిషాల పాటు మాట్లాడే అవకాశం ఇచ్చారు.మమత తన వాదన మొదలు పెడుతూనే ఈసీఐపై మాటల దాడి చేశారు. ఆరు సార్లు లేఖలు రాశాను కానీ ఒక్క స్పందన రాలేదని, ఎక్కడా న్యాయం దొరకడం లేదని ఆరోపించారు. భాషా సమస్యలు, స్పెల్లింగ్ మిస్‌మ్యాచ్‌ల వల్ల మాత్రమే ఓటర్లను తొలగించకూడదని వాదించారు. వివాహం తర్వాత ఇంటి పేరు మారిన మహిళల పేర్లను తొలగించారని తెలిపారు. ఆధార్‌ను ఆమోదించకపోవడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన అని... ఇతర రాష్ట్రాల్లో డొమిసైల్, కుల సర్టిఫికెట్లు అంగీకరిస్తుంటే బెంగాల్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల ముందు 3 నెలల్లో ఎందుకు ఇంత హడావుడి? నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉంటే ఎందుకు బెంగాల్‌ను మాత్రమే ఎంచుకున్నారు? అని ప్రశ్నించారు. బూత్ లెవల్ ఆఫీసర్ల మరణాలకు ూ×=తో సంబంధం ఉందని, హార్వెస్టింగ్ సీజన్‌లో 100 మందికి పైగా మరణాలు, హాస్పిటలైజేషన్లు జరిగాయని, అసోంలో ఎందుకు ఇలాంటివి లేవని విమర్శించారు. బెంగాల్‌ను "బుల్డోజ్" చేస్తున్నారని, ప్రజల హక్కులను కాపాడాలని ధర్మాసనాన్ని కోరుతున్నానని అన్నారు.జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, వీఎం పంచోలి బెంచ్ మమతా పిటిషన్ జెన్యూన్ అని అంగీకరించింది. ూ×= నోటీసులు పంపేటప్పుడు అధికారులు కాస్త సెన్సిబుల్‌గా ఉండాలని ఈసీకి సూచించింది. అమర్త్యా సేన్, జాయ్ గోస్వామి, టీఎంసీ ఎంపీ దీపక్ అధికారి వంటి ప్రముఖులకు నోటీసులు పంపడం గురించి ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది.మరోవైపు, మమత కోల్ కతాలోని జోగేశ్ చంద్ర చౌదరి కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టులో సొంతంగా వాదనలు వినిపించడం ఇదే తొలిసారి.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పవన్ ప్రచారం

**(మొదటి పేజీ తరువాయి)**
మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్‌ను కోరారు. ఇందుకు పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కల్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కల్యాణ్ గారు భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

## జిమ్‌ల ముసుగులో యువతులకు వల

**(మొదటి పేజీ తరువాయి)**
ఇవ్వాలని కోరుతూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు, కేంద్ర క్రీడలు-యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ూూ×)కు నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలు నిజమైతే, బాధితుల మానవ హక్కులకు తీవ్ర భంగం వాటిల్లినట్లేనని కమిషన్ అభిప్రాయపడింది.ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఓ జిమ్ కేంద్రంగా భారీ దోపిడీ రాకెట్ పనిచేస్తోందని, యువతులే లక్ష్యంగా ఈ దారుణాలు జరుగుతున్నాయని ఓ ఫిర్యాదుదారుడు ఎన్ హెచ్‌ఆర్సీని ఆశ్రయించారు. మీడియా కథనాల ప్రకారం, ఈ ముఠా వలలో దాదాపు 50 మందికి పైగా యువతులు చిక్కుకున్నారని, ఈ రాకెట్‌లో ఏకంగా ఓ పోలీసు అధికారికి ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు అధికారి ప్రమేయం ఉండటం అధికార దుర్వినియోగానికి, శాంతిభద్రతల వైఫల్యానికి, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడానికి నిదర్శనమని ఫిర్యాదుదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మహిళల భద్రతకు, మత స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని తెలిపారు. ఫిట్‌నెస్ కేంద్రాల ముసుగులో వ్యవస్థీకృత నేర ముఠాలు పనిచేస్తున్నాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆరోపించారు.ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని, బాధితులకు రక్షణ కల్పించి పునరావాసం కల్పించాలని, నిందితుడైన పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల కోసం కఠినమైన నియంత్రణ మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఫిర్యాదును ఎన్ హెచ్‌ఆర్సీ సభ్యులు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని బెంచ్ సుమోటోగా స్వీకరించింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం-1993లోని సెక్షన్ 12 ప్రకారం చర్యలు చేపట్టింది. తమ పరిధిలోని జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, రిజిస్ట్రేషన్ నిబంధనలు, ప్రమాణాలపై నివేదిక సమర్పించాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. దేశంలో జిమ్‌ల కోసం ఏమైనా జాతీయ విధానాలు ఉన్నాయా అనే వివరాలు ఇవ్వాలని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను, లైసెన్సింగ్ అవసరాలపై సమాచారం ఇవ్వాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌ను కోరింది. ప్రత్యేకంగా మీర్జాపూర్ ఘటనపై లోతైన విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అక్కడి జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పీని ఆదేశించింది. సంబంధిత అధికారులు రెండు వారాల్లోగా తమ నివేదికలను సమర్పించాలని స్పష్టం చేసింది.

## అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు

**(మొదటి పేజీ తరువాయి)** ప్లకార్డులు, భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. జనరల్ మనోజ్ కుమార్ నరవణె పుస్తకంతో పాటు నరేంద్ర మోడీ ఫొటోను ఆ బ్యానర్‌పై ముద్రించారు. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ.. ప్రజల కోసం మాట్లాడుతుంటే గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతులు నొక్కాలని చూస్తోందని అన్నారు. కానీ ప్రజాక్షేత్రంలో నిజాలు చెప్పకుండా ఎలా అడ్డుకోగలరని ప్రశ్నించారు. దేశ భవిష్యత్తును మోడీ తాకట్టు పెడుతున్న తీరు, ప్రజలకు కేంద్రం చేస్తున్న అన్యాయం, నష్టాన్ని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీజేపీ చేసే తప్పులను అంగీకరిస్తేనేడ పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం కల్పిస్తామనేలా ఎన్డీఏ సర్కార్ వ్యవహరిస్తోందన్నారు. దేశ శ్రేయస్సు, భవిష్యత్తు తరాల కోసం మాట్లాడేందుకు సభలో అవకాశం కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ప్రతిపక్ష నేతకే మాట్లాడే అవకాశం ఇవ్వకుంటే, దేశం కోసం ప్రశ్నిస్తే మైక్ కట్ చేస్తుంటే.. ఇక సభలు నిర్వహించుకోవడం ఎందుకని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు.

## కొత్త విద్యుత్ కనెక్షన్లలో మార్పులు

**(మొదటి పేజీ తరువాయి)**
గతంలో విద్యుత్ స్తంభాలు, లైన్ల కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో రీతిలో ఫీజు వసూలు చేసేవారు. ఇకపై ఫిక్స్‌డ్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. కొత్త కనెక్షన్ కావాలనుకునే వారు ఇకపై భౌతిక పత్రాలతో అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. సంబంధిత డిస్కం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ కార్డ్, సంబంధిత ఆస్తి తాలుకు రుజువులు వంటి అవసరమైన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. వినియోగదారుడి దరఖాస్తు ఏ దశలో ఉందో ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ట్రాక్ చేయవచ్చు. అధికారుల నిర్లక్ష్యం వల్ల జాప్యం జరిగితే ఆటోమేటిక్‌గా ఉన్నతాధికారులకు సమాచారం చేరుతుంది.

## ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినట్టు ఆధారాల్లేవు

ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, కృష్ణమోహన్‌రెడ్డి, టి. ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, తాజాగా సంజయ్ కుమార్‌లకు ఊరట లభించింది. ఇంకా కడియం శ్రీహరి, దానం నాగేందర్ అనర్హతపై విచారణ పెండింగ్‌లోనే ఉంది.

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనే : సంజయ్ కుమార్**
'నేను బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే. ఆ పార్టీ నుంచే గెలిచా. నా జీతం నుంచి ప్రతి నెలా రూ. 5000 బీఆర్‌ఎస్ పార్టీకి ఇస్తున్నా. అసెంబ్లీలో బీఆర్‌ఎస్ బిల్లులు ప్రవేశపెట్టి, విప్ జారీ చేస్తే నేను మద్దతు ఇస్తా. నేనెప్పుడూ బీఆర్‌ఎస్‌ను, అధిష్టానాన్ని విమర్శించలేదు. స్థానిక నాయకత్వం నాకు దూరంగా ఉంది. నాది అభివృద్ధి కోసమే ఆరాటం. నాతో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా ఇండిపెండెంట్ అభ్యర్థుల కోసం ప్రచారం చేస్తా. జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్న. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా, జగిత్యాల అభివృద్ధికి మద్దతుగా ఉన్న అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించండి. జగిత్యాల పట్టణాన్ని ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తా అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల తరవాత రైతుభరోసా



**(మొదటి పేజీ తరువాయి)**
'ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్‌ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్‌ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్‌ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్‌ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్దిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో ూాఒఃఅ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ూాఒఃఅ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్లు సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు.గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రెండేళ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ, 'కాంగ్రెస్ గెలిస్తే పేదవారు గెలుస్తారు' అని సీఎం అన్నారు.



# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

**(మొదటి పేజీ తరువాయి)**
గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు

ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు.

నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమిషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో రైల్వేకు రూ.5,400 కోట్లకుపైగా కేటాయించింది. తెలంగాణకు



మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించింది. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోంది. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తోంది. కొన్నివర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోంది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపట్లేదు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం' అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్‌ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

కేసీఆర్, రాహుల్ గాంధీ మధ్య ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి ఆరోపించారు. అందుకే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అందరి ఫోన్లు ట్యాపింగ్ చేసి పౌరహక్కులు కాలరాసిందంటూ బీఆర్‌ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. బీజేపీ కార్యాలయంలో క్లర్క్ ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారంటూ విమర్శించారు. సిట్ నోటీసులు టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయ దురహంకారం పెరిగిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. బీజేపీని చూసి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు గెలిస్తే మాత్రం ట్యాక్స్‌లు పెరుగుతాయని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే మాత్రం.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి తీరాలని కేడర్‌కు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి.. బీజేపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు.

# స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

**(మొదటి పేజీ తరువాయి)**
అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

# కాకతీయుల కాలం నాటి చిత్రాలకు ముప్పు

## ముప్పారం ముఖ్యనాథ స్వామి ఆలయంలో అరుదైన శిలాచిత్రాలు నశించే ప్రమాదం

## ప్రభుత్వం తక్షణమే పరిరక్షణ చర్యలు చేపట్టాలి: నిపుణుల విజ్ఞప్తి





**ధర్మసాగర్, /4 ఫిబ్రవరి హనుమకొండ బ్యూరో (జర్నలిస్ట్ వార్త);**

కాకతీయుల కాలం నాటి అపురూపమైన శిలాచిత్రాలు నేటి నిర్లక్ష్యానికి బలవుతున్నాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో ఉన్న పురాతన ముఖ్యనాథ స్వామి ఆలయంలోని కాకతీయుల కాలం నాటి అరుదైన చిత్రాలను ప్రభుత్వం తక్షణమే పరిరక్షించాలని ప్లిచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి డిమాండ్ చేశారు.

బుధవారం టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్యతో కలిసి ఆయన ఆలయాన్ని సందర్శించి, అక్కడి శిల్పకళ, చిత్రాల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ, క్రీ.శ. 1116 నుంచి 1157 మధ్యకాలంలో కాకతీయ రాజు ప్రోలరాజు2 భార్య ముప్పమాంబ ఈ ఆలయాన్ని నిర్మించారని తెలిపారు. ఎనిమిది శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయం కాకతీయుల శిల్పసౌందర్యానికి జీవంత సాక్ష్యంగా నిలుస్తోందన్నారు.

### పంచతంత్రం నుంచి రామాయణం వరకుడ గోడలపై జీవంత కథనం

ఆలయ గర్భాలయ గోడలపై చెక్కబడిన పంచతంత్ర కథలు, రామాయణ ఘట్టాలు, దేవతా మూర్తుల చిత్రణలు కాకతీయుల కాలం నాటి కళా నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తున్నాయని వివరించారు. ఇవి కేవలం ఆధ్యాత్మిక వారసత్వమే కాకుండా, చారిత్రక, సాంస్కృతిక సంపదగా కూడా అపూర్వమని అన్నారు.

### నిర్లక్ష్యంతో నశన దశలో చిత్రాలు

దురదృష్టవశాత్తూ సరైన పరిరక్షణ చర్యలు లేకపోవడంతో ఈ విలువైన చిత్రాలు క్రమంగా చెరిగిపోతున్నాయని, కొన్ని చోట్ల పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే తరాలు ఈ చారిత్రక సంపదను కేవలం పుస్తకాలలోనే చూడాల్సి వస్తుందన్నారు.

### పురావస్తు శాఖ స్పందించాలి

టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య మాట్లాడుతూ, ఎనిమిది శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయం ఇప్పటికీ రాష్ట్ర పురావస్తు శాఖ పరిరక్షణలోకి రాకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ఆలయాన్ని పురావస్తు శాఖ ఆధీనంలోకి తీసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే కాకతీయుల కాలం నాటి అరుదైన చిత్రాలు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉందన్నారు.

### ప్రజా ఉద్యమంగా మారాలి

ఈ చారిత్రక ఆలయ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యతతో పాటు ప్రజల బాధ్యత కూడా అని, స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ఉద్యమంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో ఆలయ పునర్వ్యవస్థాపక చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్రతో పాటు గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# పోలీసుల జోక్యంతో స్వయంకృషి కాలనీ రోడ్డు వివాదానికి తెర

## డాక్యుమెంట్లు పరిశీలించి స్థల హద్దుల స్పష్టత -పాలకవర్గంపోలీసుల సమన్వయంతో శాంతియుత పరిష్కారం







**ధర్మసాగర్,/ ఫిబ్రవరి 4 హనుమకొండ బ్యూరో (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని స్వయంకృషి కాలనీలో దాతల సహకారంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు ఏర్పడిన వివాదం పోలీసుల జోక్యంతో శాంతియుతంగా పరిష్కారమైంది. రోడ్డు పనులను కొందరు అడ్డుకోవడంతో కాలనీలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కాలనీవాసులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ నేపథ్యంలో బాధితురాలు ధర్మసాగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు.

సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించిన పోలీసులు స్థల హద్దులను స్పష్టంగా నిర్ధారించారు. ఇరుపక్షాలకు అవగాహన కల్పిస్తూ పరిస్థితిని అదుపులోకి తీసుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించారు పాలకవర్గంపోలీసుల సమన్వయంతో రోడ్డు నిర్మాణ పనులకు ఉన్న అడ్డంకులు తొలగిపోవడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. దీంతో కాలనీవాసులు ఊరట చెందారు. సమస్యను సమర్థవంతంగా పరిష్కరించిన ధర్మసాగర్ గ్రామపంచాయతీ పాలకవర్గానికి, ధర్మసాగర్ పోలీసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

## విమర్శనాత్మక ఆలోచనతోనే భవిష్యత్‌కు సిద్ధం -ధర్మసాగర్‌లో ఉపాధ్యాయులకు అవగాహన సెమినార్





**ధర్మసాగర్/ఫిబ్రవరి హనుమకొండ బ్యూరో4 (జర్నలిస్ట్ వార్త):** పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన పెంపొందించడమే ఆధునిక విద్య యొక్క ప్రధాన లక్ష్యమని జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శ్రీ కె.బి. ధర్మ ప్రకాశ్ పేర్కొన్నారు. ధర్మసాగర్ బాయ్స్ పాఠశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా "పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం మరియు విమర్శనాత్మక ఆలోచన ఎందుకు అవసరం?" అనే అంశంపై నిర్వహించిన అవగాహన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ధర్మ ప్రకాశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ప్రశ్నించే మనస్తత్వం, తర్కబద్ధమైన ఆలోచన, సాక్ష్యాల ఆధారంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అంధవిశ్వాసాలు, అపోహలు సమాజంలో వేళ్లూనుకుంటున్న నేపథ్యంలో వాటిని తొలగించడంలో శాస్త్రీయ దృక్పథం కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా ఆలోచనా నైపుణ్యాల అభివృద్ధిపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్యేకంగా ఇంగ్లీష్ తరగతులలో కూడా శాస్త్రీయ దృక్పథాన్ని అనుసంధానం చేయడం ద్వారా భాషా నైపుణ్యాలతో పాటు విద్యార్థుల విశ్లేషణాత్మక ఆలోచన, విమర్శనాత్మక దృష్టికోణం కూడా అభివృద్ధి చెందుతుందని వివరించారు.

చర్చలు, వాదనలు, ప్రాజెక్ట్ వర్క్, పఠనంరచన (రీడింగ్ & రైటింగ్) వంటి కార్యకలాపాల ద్వారా విమర్శనాత్మక ఆలోచనను ఎలా పెంపొందించవచ్చో ఉపాధ్యాయులకు ప్రాయోగిక సూచనలు అందించారు. విద్యార్థులను కేవలం పరీక్షలకే కాకుండా భవిష్యత్ జీవితానికి సిద్ధం చేసే విద్యావిధానాలు అవసరమని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సెమినార్ విద్యాబోధనపై కొత్త దృక్పథాన్ని అందించిందని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే అంశాలను తెలుసుకునే అవకాశం లభించిందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# బాధిత కుటుంబాలకు శ్రీనివాస్‌రెడ్డి నిత్యావసరాల పంపిణీ

## ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం



**రాయపర్తి/ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బాధ సారయ్య, ఓర్సు ఐలమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బుధవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలకు వేరు వేరుగా 50 కిలోల బియ్యం, నూనె క్యాన్లను నిత్యావసరాలుగా అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, అవసరమైన సహాయాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా కొనసాగిస్తామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గజవెల్లి ప్రసాద్‌తో పాటు వార్డు సభ్యులు పరుపాటి రవీందర్‌రెడ్డి, గాడిపెల్లి రాములు, తాటికాయల కేతమ్మ, సంధి దేవేందర్‌రెడ్డి, గుండెల్లి వెంకటయ్య, గబ్బేట యాకయ్య, కోలా సంపత్, సంకినేని ఎల్లాస్వామి, బోయిని కొమురయ్య, బోయిని కుమార్, కోలా యాకయ్య, చిర్ర బిక్షపతి, బాధ సుధాకర్, బాధ రవి, బోయిని అనిల్, చెన్నంగి తదితరులు పాల్గొన్నారు.

## తాటిచెట్టు నుంచి జారి పడి

# గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**కాజీపేట/ఫిబ్రవరి 4హనుమకొండ బ్యూరో (జర్నలిస్ట్ వార్త);** తాటి గీత వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఓ గీత కార్మికుడికి ప్రమాదం ముంచుకొచ్చింది. హన్మకొండ జిల్లా కేంద్రంలోని కాజీపేట మండలంలో బుధవారం ఉదయం తాటిచెట్టు నుంచి జారి పడటంతో గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. భట్టుపల్లి గ్రామానికి చెందిన పూజారి రవి (52), తండ్రి రాంనారాయణ, అమ్మవారిపేట పరిధిలోని తాటిచెట్టుకు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. ఈ ఘటనలో రవికి రెండు కాళ్లు రెండు చోట్ల విరగడంతో పాటు కాలి ఎముకలు బయటికి వచ్చే స్థాయిలో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన 6స్థానికులు వెంటనే స్పందించి రవిని హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి చెందిన పూజారి రవి పూర్తిగా పనికి అశక్తుడిగా మారడంతో అతడి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత గీత కార్మికుడికి ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా నిలవాలని గౌడ సంఘం నేతలు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అలాగే గీత కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు భద్రతా చర్యలు, రక్షణ పరికరాలు తప్పనిసరిగా అందించాలని గీత కార్మికులు, స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు

# 9వ వార్డులో విస్తృతంగా పర్యటించిన వార్డు మెంబర్ గారె కళ్యాణివిష్ణు

## స్ట్రీట్ లైట్లు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై సమీక్ష



**రాయపర్తి/ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని 9వ వార్డులో వార్డు మెంబర్ గారె కళ్యాణివిష్ణు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో నివసిస్తున్న ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా స్ట్రీట్ లైట్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. వార్డులో కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయకపోవడం, పారిశుధ్య నిర్వహణలో లోపాలు ఉండటం, తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలను ప్రజలు వార్డు మెంబర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన గారె కళ్యాణివిష్ణు, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయితీ సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ పంచాయితీ సిబ్బందితో కలిసి వార్డులోని కరెంట్ పోల్స్‌కు అవసరమైన చోట్ల కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. అలాగే పనిచేయని స్ట్రీట్ లైట్లను మరమ్మతులు చేయించేందుకు ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గారె కళ్యాణివిష్ణు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎలాంటి రాజీ పడబోమని, ప్రజలకు అవసరమైన సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పర్యటనలు కొనసాగిస్తూ ప్రజలతో సమన్వయంతో పనిచేస్తామని స్పష్టం చేశారు.

# గ్రామాభివృద్ధే నా లక్ష్యం

## సర్పంచ్ గారె సహేంద్రభిక్షపతి




**రాయపర్తి/ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త):** గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని సర్పంచ్ గారె సహేంద్రభిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 10, 11వ వార్డుల్లో పర్యటించిన ఆయన, విద్యుత్ అధికారులతో కలిసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైరులకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ గారె సహేంద్రభిక్షపతి మాట్లాడుతూ, గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన సాగిస్తామని, మౌలిక సదుపాయాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గారె కల్యాణి విష్ణు, మహ్మద్ ఫెరోజ్, లైన్‌మన్ వెంకన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.

# క్రికెట్ పోటిల్లో ముఖ్య అతిధిగా పాల్గొన్న నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుచెరుకుపల్లి నరేందర్.



**బయ్యారం/ఫిబ్రవరి4( జర్ణలిస్ట్ వార్త);** బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ముఖ్యఅతిథిగా ఇల్లెందు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రవీణ్ నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ తో కలిసి మండల అధ్యక్షుడు మంద నాగరాజు క్రీడాకారులతో కలిసి టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇల్లెందు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి నరేందర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహబావం పెంపొందుతుందన్నారు. సర్పంచ్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడి గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు.

# పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్



**వర్ధన్నపేట/ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త);**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా వరంగల్ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ వర్ధన్నపేట పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. బుధవారం ఆయన స్థానిక పోలింగ్ కేంద్రాలను, అంతర్ జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు పోలీస్ బలగాలను మోహరించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ముఖ్యంగా నగదు, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు.ప్రలోభాలకు తావులేకుండా ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని హెచ్చరించారు. ప్రతి ఓటరు ఎటువంటి భయం లేకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో తన ఓటు హక్కును వినియోగించుకునేలా చూడటంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.ఎన్నికలు ముగిసే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండి, విధి నిర్వహణలో రాజీ పడకూడదని డీసీపీ దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో స్థానిక ఏసీపీ నర్సయ్య, సీఐ శ్రీనివాస్ , ఎస్సైలు సాయి బాబు , రాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒక్కసారి ఆలోచించండి- బీజేపీకి అవకాశం ఇవ్వండి

## సత్తుపల్లిని అభివృద్ధి పథంలో నడిపిస్తాం: బీజేపీ నాయకులు







1వ వార్డు అభ్యర్థి చీకటి వసంతరావు



2వ వార్డు అభ్యర్థి మెరుగు శిరీష



8వ వార్డు అభ్యర్థి మెరుగు లక్ష్మి.

**సత్తుపల్లి/ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఒక్కసారి భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వాలని బీజేపీ నాయకులు ప్రజలను కోరారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలో బీజేపీ తరపున పోటీ చేస్తున్న 1వ వార్డు అభ్యర్థి చీకటి వసంతరావు, 8వ వార్డు అభ్యర్థి మెరుగు లక్ష్మి, 2వ వార్డు అభ్యర్థి మెరుగు శిరీష గెలుపు కోసం బీజేపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి ద్వారా వందల కోట్ల రూపాయల నిధులు వస్తున్నప్పటికీ సత్తుపల్లికి తగిన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా పట్టణ పరిస్థితి మారడం లేదని, ఇకపై ఇలా ఉండదని స్పష్టం చేశారు. సత్తుపల్లి గళం ఇక మౌనంగా ఉండదని పేర్కొన్నారు.బీజేపీకి అవకాశం ఇస్తే ప్రతి రూపాయికి లెక్క చూపిస్తామని, సింగరేణి నిధులను ప్రజల అభివృద్ధికి వినియోగిస్తామని హామీ ఇచ్చారు. సత్తుపల్లిని తెలంగాణలో ఆదర్శ పట్టణంగా మార్చడమే లక్ష్యమని వెల్లడించారు.యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా సింగరేణి నిధులతో పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానిక యువతకు ఉద్యోగ హామీతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇకపై యువత వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు.విద్య రంగంలో కేంద్రీయ విద్యాలయం, టెక్నికల్, పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐ, స్కిల్ అకాడమీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్య రంగంలో మెడికల్ కాలేజ్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు.
మౌలిక సదుపాయాల పరంగా రైల్వే లైన్, అన్ని మండలాలకు రోడ్లు, 24 గంటల నీటి సరఫరా, స్మార్ట్ సిటీ తరహా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. రైతుల కోసం రైతు బజార్, కోల్డ్ స్టోరేజ్, వ్యవసాయ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలు, పేదలు, మధ్యతరగతి వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.
ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని, కోతుల సమస్య, చెత్త నిర్వహణ, పార్కులు, వినోద కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెల డీఎంఎఫ్ నిధుల లెక్కలను ప్రజలకు వెల్లడిస్తూ పారదర్శక పాలన అందిస్తామని పేర్కొన్నారు.
ఈ ప్రచార కార్యక్రమంలో సత్తుపల్లి బీజేపీ పార్టీ ప్రభారి పడిగాల మధుసూదన్, సత్తుపల్లి రూరల్ మండల అధ్యక్షులు శాలి శివకృష్ణ, మెరుగు శేషగిరి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. చివరగా కమలం గుర్తుకే ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని నాయకులు ఓటర్లను కోరారు.

# త్వరగా గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చు

## ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు -లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో క్యాన్సర్ ప్రతిజ్ఞ






**సత్తుపల్లి/ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా దంత వైద్య నిపుణులు డాక్టర్ రామ్ హరీష్ మాట్లాడుతూ, మానవ శరీరంలోని కణజాలం నియంత్రణ లేకుండా పెరగడం వల్ల వచ్చే వ్యాధినే క్యాన్సర్‌గా పేర్కొన్నారు. క్యాన్సర్‌లోని వివిధ రకాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన విద్యార్థులకు వివరించారు.
కారణం లేకుండా బరువు తగ్గడం, దీర్ఘకాలంగా అలసట, తరచూ జ్వరం రావడం, శరీరంలో గడ్డలు ఏర్పడటం, నొప్పి ఎక్కువ రోజులు తగ్గకపోవడం వంటి లక్షణాలు క్యాన్సర్‌కు సంకేతాలై ఉండవచ్చని తెలిపారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చని ఆయన సూచించారు.
అనంతరం క్యాన్సర్ అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని, క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు కృషి చేయాలని, సమయానుసారంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే క్యాన్సర్ బాధితులకు సహానుభూతి, మద్దతు అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు రమణ, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక.



**బయ్యారం/ఫిబ్రవరి 4(జర్నలిస్ట్ వార్త);**కొత్తపేట యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీ ఎన్నికున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బయ్యారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మండా నాగరాజు పాల్గొని గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ అధ్యక్షులుగా వద్దే ఉదయ్ నియమించారు. ఉపాధ్యక్షులుగా పెనుగొండ నరేష్, గుగులోత్ మహేష్,దారం సాంబశివరావు,కార్యదర్శిలుపుల్లూరి ప్రశాంత్,పరిటాల సురేష్,నీలం మురళి ని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గంధంపల్లి కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్,ఇల్లందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకుపల్లి నరేందర్,పార్టీ సీనియర్ గ్రామ అధ్యక్షులు కారుబోతుల రామ్మూర్తి, వార్డు సభ్యులు చల్లా సురేష్,పసుపులేటి సతీష్,స్రవంతి,తిప్పారపు మదన్, నాగమ్మ,పుల్లూరి బాలరాజు, చెన్నబోయిన వెంకన్న,బోడ సాయి తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు వ్యయ నియమాలపై అవగాహన



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త):**
మున్సిపల్ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ సుధీర్ బాబు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభ్యర్థులకు ఎన్నికల వ్యయం నియమావళి అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు చేసే ప్రతి రూపాయి ఖర్చును లెక్కించాల్సి ఉంటుంది. కమిషన్ నిర్ణయించిన పరిమితికి లోబడే ఖర్చులు ఉండాలని వివరించారు. ప్రచారం కోసం చేసే ఖర్చులను ఎప్పటికప్పుడు ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేయాలని, బిల్లులు, వోచర్లు భద్రపరచాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగాలంటే అభ్యర్థులు తమ వ్యయ వివరాలను పారదర్శకంగా ఉంచాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినా, తప్పుడు వివరాలు సమర్పించినా చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, అభ్యర్థిత్వంపై ప్రభావం చూపుతుందని అధికారులు హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు సజావుగా సాగేందుకు అభ్యర్థుల సహకారం చాలా అవసరం. ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిశీలకులకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, తహసిల్దార్ విజయ్ సాగర్, స్థానిక ఎస్సై సాయిబాబు, వివిధ పార్టీల అభ్యర్థులు , తదితరులు పాల్గొన్నారు.

# కమ్మరిపేట ఎంపీపీఎస్‌లో విద్యార్థుల హాజరు పరిశీలన

## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కిరణ్



**వేలేరు/ఫిబ్రవరి 4 హనుమకొండ బ్యూరో (జర్నలిస్ట్ వార్త)**
హనుమకొండ జిల్లా వేయలేరు మండలంలోని కమ్మరిపేట గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు పరిస్థితులను సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, కమ్మరిపేట సర్పంచ్ జోడుముంతల కిరణ్ గురువారం సవివరంగా పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, వసతులపై ప్రత్యక్షంగా తెలుసుకునే ఉద్దేశంతో ఈ పరిశీలన నిర్వహించారు.
ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారి విద్యాభ్యాసం, సమస్యలు, పాఠశాలలో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. భోజన తయారీ విధానం, నాణ్యత, పరిశుభ్రత అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సమతుల్యమైన పోషకాహారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని కిరణ్ పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు శాతం మరింత పెంచేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని, పిల్లలు స్కూల్‌కు క్రమం తప్పకుండా వచ్చేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని సూచించారు.పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కమ్మరిపేట ఉప సర్పంచ్ చిలుపూరి సూర్యనారాయణతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి ఆలయ ధ్యాన మండపం ఫ్లోరింగ్ పనులు వేగవంతం





**భీమదేవరపల్లి/ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణంలో పొన్నం సత్తయ్య గౌడ్ జ్ఞాపకార్థంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తమ స్వంత ఖర్చులతో ధ్యాన మండపాన్ని నిర్మింపజేశారు. తండ్రి జ్ఞాపకార్థంగా చేపట్టిన ఈ ధ్యాన మండపంలో ప్రస్తుతం గ్రానైట్ తో ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ గ్రానైట్ పనుల కోసం మంత్రి స్వయంగా కార్మికులతో మాట్లాడి, అవసరమైన గ్రానైట్ రాయిని లారీల ద్వారా పంపించి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. పూర్తిగా మంత్రి స్వంత నిధులతోనే ఈ పనులు కొనసాగుతున్నాయి. బుధవారం నాడు శ్రీ వీరభద్ర స్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు, ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు ధ్యాన మండపం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్మికులకు సూచించారు.

## రైతులకు నూతన యూరియా యాప్ పై అవగాహన.





**బయ్యారం/ ఫిబ్రవరి 4(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ గ్రామాలైన సాంబతండా,మిర్యాలపెంట, లక్ష్మీపురం,కంబాలపల్లి,పంది పంపుల గ్రామాలలో విస్తృతంగా రైతులు, గ్రామీణ యువతకు,మహిళలకు నూతన యూరియా యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యూరియా బుకింగ్ ప్రక్రియ,యాప్ ఉపయోగ విధానం,నమోదు ప్రక్రియ తదితర అంశాలను ప్రదర్శిస్తూ శిక్షణ ఇచ్చారు.లక్ష్మీపురం విక్రయ కేంద్రంలో నూతన విధానం ద్వారా యూరియా సరఫరా సజావుగా జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు.మొబైల్ నంబర్ లింకింగ్ లేకపోతే ఏఈవో దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.పట్టాలేని రైతులు రైతులు తప్పనిసరిగా ఏఈఓ దగ్గర నమోదు చేసుకోవాలని సూచించారు.యూరియా లభ్యతపై ఎటువంటి ఆందోళన చెందవద్దని అన్నారు.రైతులకు ఎలాంటి అవసరమున్నా వెంటనే సంబంధిత ఏఇఓలను సంప్రదించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కంబాలపల్లి,మిర్యాలపెంట గ్రామ పంచాయతీల సర్పంచ్ లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

### .చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు



**స్టేషన్ ఘన్ పూర్/ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలనిచిల్పూర్ గుట్ట దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు అన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల కార్యక్రమంలోభాగంగా 16, 17,18 వార్డ్ ల ఇంచార్జ్,చిల్పూర్ గుట్ట దేవస్థానం చైర్మన్ పొట్ల పల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఇంటిం టి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ మండలం అధ్యక్షుడు గడ్డమీధీ సురేష్, మాజీ జెడ్పిటిసి స్వామి నాయక్, మల్కాపూర్ సర్పంచ్ మల్లారెడ్డి, పల్లగుట్ట సర్పంచ్ నర సింహ రెడ్డి, చిల్పూర్ మండల యూత్ అధ్యక్షుడు ఇసు రం రాజు, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్య దర్శి ఐలపాక మనోజ్ కుమార్,మూడు వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు,అంగడి రజిత,కృష్ణ, పొన్నం స్వరూప రాజయ్య, పొన్న రవి నియోజకవర్గనా యకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.ద

## అవినీతిరహిత పాలనకై యువతను ఆదరించాలి

### .జనసేనపార్టీ ఇంచార్జ్ గాదె పృథ్వీ



**స్టేషన్ ఘన్పూర్/ ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త) :** మున్సిపల్ ఎన్నికల్లో యువతను ప్రోత్సహించి ఆదరించాలని జనసేనపార్టీ నియోజకవర్గ ఇంచా ర్జ్ గాదె పృథ్వీ అన్నారు. అవినీతి రహిత పాలన జరగాలంటే జనసేన అభ్యర్థులను గెలిపించాల ని కోరారు.మున్సిపాలిటీలో పోటీలో ఉన్న పార్టీ అభ్యర్థులకు మద్దతుగా చేసిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పార్టీ అభ్యర్థు లు పోటీ చేస్తున్న వార్డుల్లో జనసైనికులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జీరో బడ్జెట్ పాలిటిక్స్ విధానంతోయువతరాజకీయల్లో కీలకపాత్ర పోషిం చాలన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో బరిలో ఉన్న16వ, 18వ వార్డు అభ్యర్థు లను గెలిపించాలని కోరారు.రాజకీయ ప్రక్షాళన యువతతోనే సాధ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో జనసేనపార్టీ జిల్లా నాయకులు డాక్టర్ గోళ్ళ రాజేంద్రప్రసాద్, గడ్డం రాకేష్, శేషాద్రి సందీ ప్,మెడిద ప్రశాంత్, కొల్లూరి అనుదీప్, అభిలాష్, మహమ్మద్ రజాక్, మహమ్మద్ ఫరీద్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీలం సుజాతను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

### -మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాడికొండ రాజయ్య



**స్టేషన్ ఘన్ పూర్/ ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ ఎన్నికల్లో 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నీలం సుజాత సుధాకర్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాడికొండ రాజయ్య అన్నారు. ఈ కార్యక్రమంలోమారపాక రవి, ఆకుల కుమార్, తాటికొండ సురేష్, కీర్తి వెంకటేశ్వర్లు,మాలోతు రమేష్ నాయ క్, బంగ్లా శ్రీను, మునిగల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేటలో ఘోర ప్రమాదం

### కారు ఢీకొని మున్సిపల్ వాటర్మ్యాన్ మృతి



**వర్ధన్నపేట/ఫిబ్రవరి 4(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట పట్టణంలో బుధవారం విషాద సంఘటన చోటుచేసుకుంది. మున్సిపాలిటీ కార్యాలయంలో వాటర్మ్యాన్గా పనిచేస్తున్న ఓర్సు మల్లయ్య (50) రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. మల్లయ్య తన లూనా వాహనంపై మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఒక కారు అతివేగంగా వచ్చి ఆయనను బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో మల్లయ్యకు తీవ్ర గాయాలవ్వడంతో ఆయన ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. విధినిర్వహణలో భాగంగా ఆఫీసుకి వెళ్తున్న వ్యక్తి ఇలా అనంత లోకాలకు వెళ్లడంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానిక మున్సిపల్ సిబ్బంది, కార్మికులు మల్లయ్య మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వైరా మున్సిపల్ ఆరో వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

### డాక్టర్ కాపా చంద్రకళకు ప్రజల మద్దతు





**వైరా/ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కాపా చంద్రకళ ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిస్వార్థ హృదయంతో వైరా పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందిన డాక్టర్ కాపా చంద్రకళ, స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన అభ్యర్థిగా ముందుకు వస్తున్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టినట్లు ఆమె ప్రచారంలో పేర్కొన్నారు.

ఈ ఎన్నికల ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపా మురళీకృష్ణ, పుల్లారావు, రఘు, లాలు పాల్గొని అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. వైరా కాంగ్రెస్ పార్టీ సంఘ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరో వార్డులో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజాసేవలకు ప్రాధాన్యం ఇస్తామని డాక్టర్ కాపా చంద్రకళ ప్రజలకు హామీ ఇచ్చారు.

# వైరా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం లక్ష్యం

### కౌన్సిలర్లకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్కుమార్ దిశానిర్దేశం



**వైరా/ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త):** వైరా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సమరానికి సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన బీఆర్ఎస్, సీపీఎం పార్టీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ బీఫాం పై పోటీ చేస్తున్న కౌన్సిలర్లకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్కుమార్ దిశానిర్దేశం చేశారు. వైరా పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన అప్పం సురేష్కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలకు స్పష్టంగా వివరించడంతో పాటు, బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని ఇంటింటా వివరించాలని అభ్యర్థులకు సూచించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు మాట్లాడుతూ, అవతలి పార్టీ బెదిరింపులు, కవ్వింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు పద్ధతు, అభివృద్ధి పాలన అందించిన బీఆర్ఎస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు. అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా సమిష్టిగా పని చేయాలని, మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# మూడు పంచాయతీల కార్యదర్శుల డిజిటల్ కి దుర్వినియోగం...?

**అనుమతి లేకుండా డిజిటల్ కీ అనేక సర్టిఫికెట్ లు జారీ అయినట్లు ఆరోపణలు...!**

**ఆలస్యంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు.**

**కేసు నమోదు ఎస్ ఐ తిరుపతి.**

**బయ్యారం/ఫిబ్రవరి 4( జర్నలిస్ట్ వార్త);** మండలంలో మూడు పంచాయతీ కార్యాలయాల్లో ఈ సేవ నుండి పంచాయతీ కార్యదర్శుల జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం పంచాయతీ కార్యదర్శులకు డిజిటల్ కి దుర్వినియోగంపై ఆలస్యంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇరుసులాపురం, నామలపాడు, కొత్తగూడెం పంచాయతీ కార్యదర్శుల డిజిటల్ కీ గత సంవత్సరం (2025) లో నవంబర్, డిసెంబర్ మాసంలో కార్యదర్శుల కీ జారి కాక పోవడంతో, డిజిటల్ కీ కోసం ముగ్గురు కార్యదర్శులు దరఖాస్తు చేసుకోగా, కొత్త డిజిటల్ కి వచ్చేలోపే కార్యదర్శులకు సంబంధం లేకుండా, ఆయా పంచాయతీ కార్యాలయాలలో పాత డిజిటల్ కీ తో గుర్తు తెలియని పంచాయతీ ఆపరేటర్లు, డిజిటల్ కీ దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. డిజిటల్ కి తో మూడు పంచాయతీ లలో జనన, మరణ,ఇతర ధ్రువీకరణ పత్రాలు అనేకం జారీ అయినట్లు మండలంలో గుసగుసలు వినబడుతున్నాయి. డిజిటల్ కీ జాగ్రత్తపరచుకోకపోవడం తోనే పాత డిజిటల్ కీ తో కొంతమంది దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దీనిపై ఎంపీ ఓ చంద్రమోహను వారి సంబంధిత జిల్లా డిఎల్ పిఓ, డిపిఓ సమాచారం ఇచ్చి, జిల్లా అధికారులు ఆదేశానుసారం గా,మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో మండల పంచాయతీ కార్యదర్శుల సిబ్బందితో కి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై ఎస్సై తిరుపతి నుంచి వివరణ కోరగా మూడు పంచాయతీ కార్యదర్శుల కీ దుర్వినియోగం పై ఎంపిఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

## 10వ వార్డు అభివృద్ధి కోసమే నా లక్ష్యం

### కత్తెర గుర్తు పై ఓటు వేసి అత్యాధిక మెజార్టీ తో గెలిపించెలి మహర్షి- కంజర్ల మహేష్...



**వర్ధన్నపేట/ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త):**10వ వార్డు అభివృద్ధి కోసమే నా లక్ష్యం అని , కత్తెర గుర్తు పై ఓటు వేసి అత్యాధిక మెజార్టీ తో గెలిపించెలని మహర్షి- కంజర్ల మహేష్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట 10వ వార్డు స్వతంత్ర అభ్యర్థి కంజర్ల మహా శ్రీ మహేష్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి జెండా మోసిన కార్యకర్తలను విస్మరించడం స్థానిక నాయకత్వ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. జైలు శిక్షలు అనుభవించి పార్టీని బలోపేతం చేస్తే, నేడు పారాచూట్ నేతలకు ప్రాధాన్యత ఇవ్వడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నా పోరు కేసీఆర్ పై కాదు, స్థానికంగా సాగుతున్న రాక్షస పాలనపైనే అని ఆయన స్పష్టం చేశారు. అధినేత సిద్ధాంతాలే తన శ్వాస అని చెపారు, అన్యాయానికి వ్యతిరేకంగానే కత్తెర గుర్తుతో బరిలోకి దిగానని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలే తనకు హైకమాండ్ అని, తన విజయాన్ని కేసీఆర్ కి కానుకగా అందిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వార్డులో అవినీతిని కత్తిరించి, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని మహేష్ వాగ్దానం చేశారు. ఒక సీనియర్ కార్యకర్తగా తనకు న్యాయం చేయాలని వార్డు ప్రజలను ప్రాధేయపడ్డారు. కత్తెర గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి, ప్రజా సేవలో భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.

# వర్ధన్నపేటలో కాంగ్రెస్ హవా

### - బీఆర్ఎస్కు భారీ షాక్.. క్యూ కట్టిన నేతలు



**వర్ధన్నపేట/ ఫిబ్రవరి4 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్ ఎన్నికల నగారా మోగకముందే వర్ధన్నపేట రాజకీయం వేడెక్కింది. పట్టణంలోని 11వ వార్డులో అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలసల వరద కొనసాగుతోంది. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు హస్తం గూటికి చేరడంతో గులాబీ శ్రేణుల్లో కలవరం మొదలైంది. కాంగ్రెస్ అభ్యర్థి ఈగ దామోదర్ నేతృత్వంలో జరిగిన ఈ భారీ చేరికల కార్యక్రమంలో పలువురు కీలక నాయకులు పార్టీలో చేరారు. పులి సత్యనారాయణ (బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు) చిదురాల రమేష్ఎం.డి. సోహెల్, పొడిశెట్టి రవిచందర్, లను వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి వల్లే నేడు స్వచ్ఛందంగా నాయకులు కాంగ్రెస్ వైపు వస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే మాకు శ్రీరామరక్ష అన్నారు. అభివృద్ధిని చూసే ప్రజలు మా వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.వార్డు అభ్యర్థి ఈగ దామోదర్ మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన వారితో కలిసి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానాని హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ జరుగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయబోతుందనే సంకేతాలను ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నేతలు మాజీ ప్రజా ప్రతినిధి లు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలుపుతోనే వార్డుల అభివృద్ధి సాధ్యం

## ఏఐసీసీ సెక్రటరీ పెరుమాళ్ విశ్వనాథన్

**వర్ధన్నపేట/ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త);**కాంగ్రెస్ గెలుపుతోనే వార్డుల అభివృద్ధి సాధ్యం. మని ఏఐసీసీ సెక్రటరీ పెరుమాళ్ విశ్వనాథన్ అన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాలంటే హస్తం గుర్తును ఆదరించాలని ఆయన కోరారు. రాష్ట్రంలోనే రేవంత్ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల బరిలో ఆరుగురు మహిళలు, ఆరుగురు పురుషులు బరిలో నిలిచిన విషయం గుర్తు చేశారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. సంక్షేమ పథకాలలోనూ మహిళకు సమాన వాటా ఇస్తుందన్నారు.అనంతరం వర్ధన్నపేట మున్సిపాలిటీ 2వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి భూక్య ప్రమీలబాబులాల్ తరపున నిర్వహించిన ఇంటి ఇంటి ప్రచారంలో ఏఐసీసీ సెక్రటరీ పెరుమాళ్ విశ్వనాథన్ ముఖ్య అతిథిగా పాల్గొని. ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

2వ వార్డు ప్రజల కష్టసుఖాలు తెలిసిన అభ్యర్థి భూక్య ప్రమీలబాబులాల్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే, వార్డును అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల వంటి మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే అభ్యర్థిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.



నియోజకవర్గాని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా. ఎమ్మెల్యే....

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గాని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానాని స్పష్టం చేస్తారు. గతంలో ఎన్నడు లేనివిధంగా మున్సిప్ కోర్టు, సబ్ జెల్,ఇంటిగ్రేటెడ్ స్కూల్ , 100పాదుకల హాస్పిటల్ , మార్కెట్ , జమ్ము సెంటర్, స్టేటస్ గ్రౌండ్, ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో 12కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అయూబ్. మాజీ టాస్క్ అబ్ చైర్మెన్ మార్నెని రవీందర్ రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది

### అంబటి కుటుంబాన్ని పరామర్శించిన

## మాజీ సీఎం జగన్



**గుంటూరు, ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త);** సీఎం చంద్రబాబు ఏడాదిన్నరగా కావాలనే ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టారని సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. తిరుమల లడ్డు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని రకరకాలుగా ప్రచారం చేశారని, చివరికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

కూడా అసత్య ప్రచారం చేశారని అసహనం వ్యక్తం చేశారు. దేవుడంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా రాజకీయాలు చేశారని ఫైర్ అయ్యారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజని మీద దాడులు చేశారని.. వారు చేసిన తప్పేంటి? అని ప్రశ్నించారు. ఇదే ప్రభుత్వం ఎప్పుడూ ఉండదని, వచ్చే మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి.. ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు.వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ? 'రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తుంది. భయానక వాతావరణంలో పాలన జరుగుతుంది. అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చూస్తే జంజిల్ రాజ్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. అంబటి, జోగి, కాకాణిలు చేసిన తప్పేంటి?. ప్రశ్నిస్తున్నారని మా వాళ్ళపై దాడులు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కుట్ర పూరితంగా జంతువుల కొవ్వు అని తప్పుడు ప్రచారం చేసాడు. ఆవు, పంది, చేప కొవ్వు అంటూ ఉద్దేశ్య పూర్వకాలంగా దేవుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గారికి దేవుడంటే భయం భక్తి లేవు. దుర్మార్గంగా తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర ల్యాబ్లు ఎలాంటి జంతువుల కొవ్వు లేదని రిపోర్ట్ ఇచ్చాయి. సీబీఐ అదే విషయాన్ని సుప్రీం కోర్టుకి రిపోర్ట్ ఇచ్చింది. తప్పు చేసి ఉంటే వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పేర్లు సీబీఐ ఎందుకు చేర్చలేదు. సీబీఐ వాళ్లకు క్లీన్ చిట్ ఇచ్చింది. అసలు సీబీఐ విచారణ కావాలని సుప్రీమ్ కోర్టును కోరిందే వైవీ సుబ్బారెడ్డి. చంద్రబాబు, లోకేష్, పవన్లు చెంపలేసుకుని క్షమాపణ కోరాలి. క్షమాపణ చెప్పకుండా మళ్లీ అదే దుర్మార్గపు అపార్థాలను ప్రచారం చేస్తున్నారు' అని ౖ÷ర్ అయ్యారు.'సిగ్గు లేకుండా ప్లెక్సీలు వేయిస్తున్నారు. కుల మతాలను రెచ్చగొట్టే ప్లెక్సీలు పెట్టడం రాజ్యాంగ విరుద్దం కాదా. ఇలానే మేము సూపర్ సిక్స్ అమలు చెయ్యలేదని ప్లెక్సీలు వేస్తే ఒప్పుకుంటారా. ప్లెక్సీలు పెట్టి ప్రజల్లో బావోద్వేదాలు రెచ్చగొట్టేలా చెయ్యడం తప్పు కాదా?. ఇలాంటి దుర్మార్గాలను ప్రశ్నిస్తే మా వాళ్ళపై దాడులు చేయిస్తారా?. సీఎం చంద్రబాబుకి మంచి బుద్ది ప్రసాదించాలని దేవుణ్ణి కోరి గుడి నుండి వస్తుంటే దాడులు చేసారు. అంబటి రాంబాబుని పోలీసుల సమక్షంలో కర్రలు పట్టుకుని కారుపై దాడికి పాల్పడ్డారు. కారులో ఉన్న రాంబాబుని దారుణమైన భూతులు తిడుతూ దాడి చేసారు. ఒక్కడే ఉండటం వల్ల అంబటి ఆగ్రహానికి గురయ్యారు. అలాంటి సమయంలో నోట్లో నుండి రెండు తిట్లు వచ్చాయి. ప్రాణం మీదకి వచ్చినప్పుడు వచ్చిన తిట్లే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా తిట్టలేదు. సంస్కారం ఉన్న వ్యక్తి కనుక ఆ మాటలు రావడంపై బాధపడి.. వివరణ ఇచ్చాడు. తిట్లు వచ్చినందుకు చింతిస్తూ వెనక్కి తీసుకున్నాడు. అలాంటి సంస్కారం ఉన్న అంబటిని చేతనైతే పొగడాలి.. కానీ దుర్మార్గంగా హత్య చెయ్యడానికి ప్రయత్నించారు. ఏకంగా 8 గంటల పాటు హత్యకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలో దాడి చేశారు. ఇంట్లో మహిళలను ఇష్టం వచ్చినట్లు తిడుతూ ఫర్నీచర్ పగలగొట్టారు. కార్లు ధ్వంసం చేసి.. ఆఫీస్ కి నిప్పు పెట్టారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి దాడులు జరిగేవా?. డీజీపీ ఆఫీస్ కూతవేటు దూరంలో ఉంది.. పక్కనే బెటాలియన్ ఉంది.. కంట్రోల్ చెయ్యలేరా?. అధికారులకు ఫోన్లు చేసినా ఒక్కరు ఎత్తలేదు.. పక్కా ఎ÷–లాన్ ప్రకారం హత్యాయత్నం చేసారు' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

### ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి

### అవగాహన కోసం షార్ట్‌ఫిల్మ్‌లు తీస్తా

### క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి

హైదరాబాద్,**ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త);** క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు.శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.





# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము

### కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం

న్యూఢిల్లీ,**ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త);**



మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు.

---------------

## జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఇంజనీర్ మృతి

విశాఖపట్టణం,**ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త);** జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం విశాఖ జిల్లా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఓ ప్రైవేటు కంపెనీలో చీఫ్ ఇంజినీర్ గా పని చేస్తున్న హర్షవర్ధన్ (36) విజయవాడ వైపు వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా హర్షవర్ధన్ బుధవారం ఉదయం సూసైడ్ నోట్ రాసి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఆయన అదృశ్యమైనట్లు న్యూపోర్టు పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్లో హర్షవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణంగా తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..

### ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

**2020-24 మధ్య కాలంలో ఎయిడ్స్ కారణంగా దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది మృతి**

**ఏపీలో 32,642 మంది... తెలంగాణలో 11,498 మంది మృతి**

**విదేశీ తరహా జీవనశైలి వల్ల ఐటీ రంగంలో విస్తరిస్తున్న వైరస్**

**ఫిబ్రవరి4(జర్నలిస్ట్ వార్త);**



ఏపీ, తెలంగాణల్లో ఎయిడ్స్ మరణాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో హెచ్ఐవీ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం... 2020-2024 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్ఐవీ కారణంగా చనిపోయారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో మరణించిన వారి సంఖ్య 44,140గా ఉంది. ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.